గోడమీద బల్లి వులిక్కిపడింది తన నీడ చూసుకుని — వోల్టేజ్ తక్కువయి వెలుగుతున్న బల్బు చటుక్కున కాంతితో వుబ్బింది...

"చాలా రోజులయింది మిమ్మల్ని చూసి—పెళ్ళిలో చూడ్డమే — యిన్నాళ్ళకి అనుకోకుండా జరిగింది యిలారావడం."

"మామయ్యా, నువ్వు పెద్దవాడివయిపోయావ్" అంది అనసూయ ఆయన తలనీ మొహాన్నీ చూస్తూ.

"యీమాట మీ అత్తయ్య విందంటే నీమీద సూట్ ఫైల్ చేస్తుంది జాగ్రత్త." ముగ్గురి నవ్వులూ కలిసిపోయాయి ... ఆయనే అన్నాడు ... "యిందులో ఆశ్చర్యపడాల్సిం దేముంది చలపతీ— చిన్నవాడినయితే తప్ప ... యేమంటావు..."

"నిజమే" అన్నాడు చలపతి.

"యెలా వుంది మీ సంసారం— సాఫీగా సాగిపోతోందా — అనసూయా" అడిగాడు భానుమూర్తిగారు అనసూయని చూస్తూ...

"అదేమిటండీ — యిద్దర్నీ కూర్చోబెట్టి అడిగితే యెలాచెప్పేది ... అంతేనంటావా అనసూయా" అన్నాడు చలపతి.

"నిజం మామయ్యా ... నన్నొక్కదాన్నే యే వంటిట్లోనో వంటిగాచూసి అడిగావంటే—యీయనగారు నన్ను బాధ పెట్టేస్తున్నారనీ. యెప్పుడూ తోడుగా సినిమాకు తీసుకువెళ్ళరనీ — నా భావాలు అర్థం చేసుకోరనీ చెప్పేదాన్ని — కానీ ఆయన వుండిపోయారు ... యెలా చెప్పేది..." చిన్నగా నవ్వుతూ అంది భర్తని చూడండి అన్నట్టు ధీమాగా ...

"అవునండీ—భోజనంలో రాళ్ళపాలు అమితం—రుచి మితం—కాఫీలో నల్లనీళ్లూ తెల్లనీళ్ళూ యెప్పుడూ డైవర్స్ యిచ్చుకుంటాయి...సూటీపోటీ మాటలు—అలకలు — రుక్మిణత్తయ్య కూతురు ప్రభావతి—లేకపోతే యెదిరింటి సరోజో నా కళ్ళలో కన్పిస్తున్నారని యీర్ష్య......యివన్నీ యెవరితో చెప్పుకోను — మీరొచ్చారుకదా యే బీచ్‌వడ్డునో అతి దూరంగా సముద్రం కన్నీటి కెరటాల్ని రేపుకుంటున్న సాయంత్రం — యీ గుండెల్లో బాధకూడా అంతేనని చూపుదాం అనుకున్నాను —" అన్నాడు మరింతగా నవ్వుతూ చలపతి.

"బావుందర్రా — యిదే మీ అత్తయ్య అయితే యేంచేసేదో తెలుసా" ఉపోద్ఘాతం మొదలుపెట్టాడు భానుమూర్తిగారు.

"దానికీ నాకూ, వేలసంఖ్యని వందల సంఖ్యతో హెచ్చవెయ్యడంగానీ, భాగారించడంగానీ చేతకాని రోజుల్లో పెళ్ళయ్యింది...తిరిగి మేం కల్సుకునే సరికి అది చలం, బుచ్చిబాబూ, లారెన్స్, మామ్ నావెల్స్ చదివే అంతగా యెదిగిపోయింది...."

"అంటే నీకు తగ్గ యిల్లాలుగా తర్ఫీదు అయ్యిందన్నమాట" అనసూయ అంది...

"నేను దాన్నిచూసి పోల్చుకోలేక 'అమ్మాయ్...యిక్కడ సీత అనే పిల్ల వుండాలి తెల్సా' అని అడిగాను"

"మీ భార్యనే...?"

"అవును. అదేంచెప్పిందో జవాబుగా తెలుసా ... 'నేనే...యెందుకు?' అంది ప్రశ్నార్థకంగా" .

"బలే — బలే..."

"బలేకాదమ్మా, .దీని కెంత మొగాళ్లు సమాధానం యివ్వగల్రు చెప్పు అనసూయా...యెవరో నీ మొగుడొచ్చాడంటే తలుపు వారలోంచి వంటి కంటితో చూసే ఆడదాన్ని — కాలరెత్తుకుని వచ్చిన మనిషి భర్తకాబట్టి—సిగ్గుతో లేత ఆకులా ముడుచుకుపోయిన భార్యల్ని మాత్రం యెరుగుదును...నాభార్య-సీత-అలా అడగటంతో నా వాక్కు పూర్తిగా పడిపోయింది — 'నువ్వు నా భార్యవని చెప్పనా — లేక నేను నీ మొగుణ్ణి' అని చెప్పాలో తెలియక తికమక పడ్డాను..."

"అదేమిటి మామయ్యా...యెంతైనా భార్యేగా — సీతా అని పిలవలేక పోయావ్..."

"అదెలా ... మొదటే నేను సీతా అని సంభోదించివుంటే మరోవిధంగా వుండేది మా తొలి కలయిక — తీరా అప్పుడు పిలవడం ప్రమాదం అన్పించింది..."

"మరేంచేశారు..."

"ఏంచెయ్యలేదు ... ఆలోచన తెగే లోపల ఆపద్బాంధవుల్లా అత్తగారువచ్చి రక్షించారనుకోండి ... యింతకీ చెప్పొచ్చేది — మా సంసారం మొదలుపెట్టాక

"పండుగపూట కలిగింది వేసాం. వెళ్ళు..."
"మనయింటిలోనుండి వడలవాసన వస్తూంటే.. వెళ్ళమంటారా..."

మాకు యే విభేదాలూ, మనస్పర్ధలూ లేవు ... యెందుకంటారేమో ... అది, దాని వుద్దేశాలు చెప్పేసేది – నేనూ అంతే...వో పారి దానికి కోపం వచ్చి తిప్పుకోలేకపోయింది కాబోలు –

'మా వాళ్ళు చేసేరుగాని అసలు మీరంటే నా కిష్టంలేదు యెప్పుడూ కూడా' అంది...

"ఛా అన్నీ అబద్ధాలు మామయ్యా.."

"చెప్పనీ – మాటల్లో అడ్డుకోకు మరి ... నాకేం బాధ అనిపించలేదు... నా వుద్దేశాలు కూడా అప్పట్లో వేరుగానే వుండేవి...నా భార్య అంటే–అమ్మలా, పిన్నిలా, చెల్లాయిలా వుండాలి...మాటలాడని స్త్రీ అంటే నాకు అభిమానం... అమాయకత్వం తొణికిసలాడే ఆడదంటే ప్రాణం...అవేమీకూడా మీ అత్తయ్యలో లేవు...అందుకే వెంటనే నేనూ అనేశాను...'వోసి వెఱ్ఱి మొహం – నేను మాత్రం నువ్వంటే పడిచస్తున్నాననుకోకు – మనల్ని మైనర్లుగాచేసి పెద్దాళ్ళుచేసిన పెళ్ళిది...వాళ్ళమీద గౌరవం కొద్దీ తప్ప, నా భార్య వేరు రూపంలో వుండాలని నాకూ ఆశగా వుంది...'అని.

"అయితే మీ మధ్య రోజూ పోట్లాటే నన్నమాట..." చలపతి అన్నాడు...

"పొట్లాటేమిటయ్యా ... మేం యీ వాదన చేసేసరికి మా పెద్దబ్బాయి కాలేజీలో చదువుకుంటున్నాడు ... లలిత పరికిణీలు, వోణీలూ వేసుకుంటూ వివాహ వేదిక్కి దగ్గరవుతున్నానని పరోక్షంగా హెచ్చరిస్తోంది..."

"అయితే తీరని కోరికలతోనే, సంసారయాత్ర సాగిపోతోందన్నమాట...''

భానుమూర్తిగారు దీర్ఘంగా నవ్వాడు.. హాలంతా దద్దరిల్లింది. కళ్ళజోడులోంచి కంటిపాప తళతళమంది...

''అదేంలేదు చలపతీ ... అయిష్టత కొద్దిగానైనా వుండకపోతే బ్రతుకుపట్ల రుచి చస్తుందనుకో. .దొరకనిదానికోసం వెదుకులాడ్డం...అశాంతి వడిలో పడి

పోతామేమోనని భయంతో, వొకళ్ళ కొకళ్ళు దగ్గరవడంకోసం ప్రయత్నం చెయ్యడం, ... జరుగుతూంటాయి ... గోల్‌కీపర్ అనేవాడు లేకపోతే గోల్ చెయ్యడానికి యే ప్లేయర్ అన్నవాడైనా వొప్పుకుంటాడా చెప్పు...''

''కలతలతో వొకళ్ళ నొకళ్ళు వంచించుకోవడం, మనస్పర్ధలు ... యివన్నీ యెలా జరుగుతున్నా యంటారు...''

''ఎదటి మనిషి నిజరూపం తెల్సుకోపోవడం మూలంగానే...నా భార్యే వుందనుకో...దాని బాధలు అది చెబుతుంది.. నా వుద్దేశాలు నేను చెబుతాను... చాలా వాటిని సమన్వయంగా తీర్చిదిద్ది యేకంచేసుకుంటాం...మిగిలిన వాటితో 'మరోజన్మ'కని సంధి చేసుకుంటాం..."

అనసూయ ఆలోచిస్తూఅంది...

"మా స్నేహితురాలు వుండేది మామయ్యా, ఇందుమతి అని—అది చాలా అందంగా వుండేది... అది మాఅందరికీ తెలుసు... పదిమంది కలిసి యెక్కడి కైనా వెడితే అది రాజకుమార్తెలా, మేమంతా చెలికత్తెల్లా వుండేవాళ్ళం..."

"బాగానేవుంది. మీరు కాలుపెట్టిన చోటల్లా ప్రేమ విజృంభణ... తద్వారా యీర్ష్యలు, పోటీలూ, యుద్ధం, యివన్నీ క్షణాలమీద సృష్టిచేసే వారన్నమాట.." చలపతి నవ్వాడు... కానీ అనసూయ గతంలోకి ప్రయాణం చేసినదానిలా వుంది... మాటలు మాత్రం ఆలోకం నుంచి విసురుతున్నట్లుగా వస్తున్నాయి..

"దాని జీవితంలో నిజమైన పతనం తను అందగత్తెనని తెలియడం మూలంగానే ప్రారంభమయింది. అదే బాధాకరం మామయ్యా... ఇందుమతిలాంటి వాళ్లెందరో సుఖపడ్డారు... అందంతో ఆకర్షించి నిజ జీవితానికి బంగారు పూవులద్దుకోవడం— వెన్నెలతో బ్రతుక్కి చాందినీ కట్టుకోవడం దానికొక్కదానికే కుదరలేదు... యెంచేతో...''

''అదేం... అంత అందగత్తెకు యే మగాడూ అందిరాలేదా... లేక అవిడే తృణీకరించిందా...''

"అలాజరిగితే బాగానే వుండేది మామయ్యా... అదీకాలేదు... బి. య్యే పాస్ అయ్యింది... యేదో కొద్దిపాటి ఆస్తి, బంధువులూ వున్నారు. అప్పటికి దాని బ్రతుకు—సరిగ్గా వెన్నెట్లో ముగ్గుతో చుక్కలు పెట్టుకుంది... యిక పట్టీలూ... వంకీలూ తిప్పడం తరవాయి... అందమైనబొమ్మ తయారవుతుంది...కానీకొంతమంది దాని అందంముందు ''యిన్‌ఫీరియారిటి" తో, మరి కొందరు భయంతో ఆ చుక్కల్ని కలయతొక్కేసారు ... వట్టి బూడిద— కాళరాత్రి మింగి, కక్కిన వెన్నెల ఆనమాలుగా మాత్రం మిగిలింది. దాని జీవితం అఖరికి మాటలురాని శిలా ఖండంలా, అపురూపమైన అజంతా సుందరిలా అయిపోయింది... అందరూ

ఆ బొమ్మని చూసి మాత్రం ఆనందిస్తారు.. పూజిస్తారు...కలల్లో కని తపిస్తారు... అంతేతప్ప మనిషనుకోరు...

"అయితే" అన్నాడు చలపతి—

"ఏడాదిక్రితం అది నాకో వుత్తరం వ్రాసింది..."

"ఓ మొగుణ్ణి వెతికిపెట్టమనా"

'అనసూయా ... ... నన్నింతకాలం నాలో ఆకర్షణా, అందం మభ్యపెట్టాయి.. వాటినే ప్రేమిస్తూ అదేజీవితం అనుకున్నాను ... తీరా నేను చిటారుకొమ్మ చేరినతర్వాత వంటిగా నిలవలేననీ యేదో వో ఆధారంతో ఊగాలనిపిస్తోంది ... కానీ నేను పైనుంచి క్రిందకి రాలేను— నాదగ్గరి కెవరూ రావడంలేదెలా'గని ?"

"బావుంది ... కాశీమజిలీ కథలోలా రాత్రి అరుగుమీద పడుకున్న యే మగవాణ్ణో పెళ్ళి చేసుకుంటే పోయేదిగా" చలపతి అన్నాడు.

"అలాగే చేసింది ... తనమీద తను అసహ్యం పుట్టించుకుంది ... కావాలనుకున్నవి అందకపోయిన తర్వాత నాకేదో కావాలీ అనుకోవడం ఆగిపోవాలి— అందుకే పెళ్ళాం పోయి ముగ్గురుపిల్లలున్న వో ముసిలాయన్నిచూసి పెళ్ళి చేసుకుంది..."

"ఘోరం ... కావాలనే యీశిక్ష విధించుకుందా..."

"అవును ... తన్ని వంచించిన అందాన్ని యేడిపించాలని, బానిస చేసి రాసి రంపాన పెట్టాలనీ అలా చేసిందిట"

"ఇప్పుడైనా సుఖంగా వుందా..."

"లేదు మామయ్యా ... ఆ అందం తిరిగి దాన్ని మోసగించింది ... వెర్రి కోపంతో తన్ని తను గాయం చేసుకుంది ... అదృశ్యుడైన భగవంతుణ్ణి ఆడిపోసికోవటం లాంటిది ఆ కోపం. మనం ఆయన్ని తిట్టినంతమాత్రాన, అదృష్టాలు, అనర్ధాలూ తప్పించుకోలేంగా... దానిమొగుడు రోజూ రాసి రంపాన పెడతాట్ట...ఆయనకి చచ్చే అనుమానం. తనను యెక్కడ మోసగిస్తుందోనని కళ్ళల్లో కాపలా కాస్తాడుట..."

"పెళ్ళి చేసుకున్నా అంతే అయిందన్నమాట..."

"అవును...ఆఖరికి కోపంతో విసిగి అందట కూడానూ... 'నేను మిమ్మల్ని కోరిచేసుకున్నా— మోసం చేసే వుద్దేశం నాకేంలేదు... యెవరితోనో లేచిపోవడానికీ, అందర్నీ ఆకర్షించడానికీ అయితే మిమ్మల్ని పెళ్ళిచేసుకోవడం దేనికి... నన్ను మనస్పూర్తిగా ప్రేమించండి. యెందుకు అనుమానిస్తార'ని యేడ్చి మొత్తుకుందిట."

భానుమూర్తి నిట్టూర్చి అన్నాడు...

"ఆ అమ్మాయి పెళ్ళిచేసుకోకుండా వుంటేనే సుఖపడేదేమో... అందరికీ పనిచేసే మందులు కొందరికి వెగటు సూచిస్తాయి... అమృతం తాగితే ప్రతి

వాడూ బ్రతకకపోవచ్చు చలపతీ... మనసు కోడెత్రాచులాంటిది... మనిషి రక్తం మింగిందంటే చస్తానని తనకూ తెలుసు... అయినా మనిషిని కరిచి చంపుతుంది— అదే విచిత్రం...''

''తరువాత యేం జరిగింది...''

''మామయ్య చెప్పినట్టేఅయింది. కక్ష కొద్దీలోకాన్ని కరవాలనుకుంది..తద్వారా తనకు సుఖం, శాంతి లభిస్తాయనుకుంది...''

అనసూయ లేచి టేబిల్ మీద వున్న బుక్ తెరచి వో వుత్తరంతెస్తూ అంది... ''నిన్నటిరోజు వుత్తరం వ్రాసింది... ఇందుమతి ఆఖరి వుత్తరం యిదేనేమో బహుశా...''

చలపతి వుత్తరం అందుకుని విప్పాడు...అక్షరాలుకూడా అందంగానే వున్నాయి... సిరా మాత్రం కాంతిలేక నీళ్లువారినట్లుగా అన్పిస్తోంది...

''చిన్నప్పటినుంచీ నన్ను నేను అభిమానించుకుంటూ పెరిగాను అనసూయా.. అలాగే అందరూ నన్ను ఆదరించాలనుకునేదాన్ని... అందుకే అందరిమధ్యా తిరిగేదాన్ని...యెదిగేటప్పటికి నన్నూ, నా అందాన్నీ చూసి యెవరైనా ప్రేమించి పెళ్ళిచేసుకుంటే చాలనిపించేది. నా కోరిక వింతగా వుందికదూ... యిదో వెర్రితనం అంటావ్ నువ్వు— కానీ ఖర్మ— నా ఆశ అది— నన్ను చూసి, నువ్వుకావాలి నాకు— అనే మనిషికి ప్రాణం యివ్వాలనిపించేది... దానికోసమే పాతిక సంవత్సరాలు యెదురుచూశాను... కానీ నాకు మిగిలింది నిరాశే అయింది... నాలో లోపంలేదు... అందుకే వెర్రికోపం... యెవరినో కాటువెయ్యాలని నాకు జీవితంలో విలాసాన్నీ, తృప్తినీ యివ్వని యీ అందం మీద కక్ష కలగడం మొదలు పెట్టింది... పెళ్ళిచేసుకున్నాను... కానీ అక్కడా వోడిపోయాను... నా అందం నాకు శత్రువు...మనసు నన్ను మోసగించింది... జీవితంలో నేను యీ రోజుకి పూర్తిగా వోడిపోయాను... అందుకే యీ నిష్క్రమణ...' 'ఇందుమతి'

ఉత్తరం ముగించాడు. చలపతి...

''కోరికలు చాలా చిత్రమయినవి అనసూయా...తీరనంతకాలం వేధించుకు తింటాయి...తీరా కోరికలు తీరుతూంటే మనల్ని మనమే తెల్సుకోలేం ... వో రకమైన మానసిక అసంతృప్తే దీనికి కారణమేమో...'' ఆగి అన్నాడు భానుమూర్తిగారు...

''నాకు చిన్నప్పుడు మిఠాయి దుకాణంలో కూర్చున్న యజమానిని చూస్తే వెర్రికోపం పుట్టుకొచ్చేది ... అణా పట్టుకొని వెడితేగాని మన్ని దరిదాపుకి రానివ్వడువాడు ... వాడుమాత్రం మహారాజులా చుట్టూ రకరకాల పదార్థాలమధ్య కూర్చుంటాడు ... వాడ్ని చూసినప్పుడల్లా నేనూ వో మిఠాయి దుకాణం పెట్టాలని ఆశపడేవాణ్ణి...''

‘‘మావారికికూడా యిష్టం మిఠాయి అంటే ... యిప్పుడయితేమాత్రం పెట్టొచ్చుగా...’’

భానుమూర్తిగారు చిన్నగా నవ్వి ... “వుండబట్టలేక వోరోజు అడిగేశాను...’ ‘మరి నువ్వు యిన్ని పదార్థాల మధ్య కూర్చుంటావు...వాటినెప్పుడూ కనీసం తినాలనిపించదా తినవా’’ అని.

‘ఛా ఛా ... యివంటే అసహ్యం నాకు’ అన్నాడు—వాడు.

‘యేం? ఆకలివేసినా యెంగిలిపడవా’ అన్నాను నమ్మకంలేక...

‘తిన్నండీ ... అంతగా ఆకలివేస్తే యింటికివెళ్ళి, మా యింటిది చేసిన సరుకులు తింటాగానీ, యివి చూస్తూంటే నాకు వున్న ఆకలికూడా చస్తుం’దంటూ గల్లా పెట్టిలోంచి వో పొట్లంవిప్పి అందులో చేగోడీలు రెండునోట్లో వేసుకుని నవలడం మొదలుపెట్టాడు ... అప్పుడే నాకు జీవితం అంటే అర్థమయింది అనసూయా...’’

‘‘యేమిటి— భూమి గుండ్రం, చేగోడీ గుండ్రం అనా...’’

“కాదు...జీవితం—దానిపట్ల ఆశలు, ఆశయాలపట్ల సుముఖత ... కక్షలూ, కోరికలూ—అన్నీనావే అనుకునే అహం—యిదంతా వట్టి అభూతకల్పన అన్పించింది ... కోరికలన్నవి మితంగా లేకపోతే మనంకూడా ఆ అంగడి

“పోలీస్‌అబ్బాయ్ : చూడు, మరే, మరే, నేను లేకుండా మా అమ్మ వెళ్లింది, మరి నువ్వు చూశావా ఎటు వెళ్లిందో ?”

వాడి మనస్తత్వంతో సమానమయిపోతాం ... ఆకలివేసినప్పుడు వో అణా పట్టుకుని ఆశతీర్చుకోవడం వుత్తమం గానీ — అత్యాసతో పెద్దదుకాణం పెట్టాలనుకుంటే మనకూ ఆ నిస్పృహ — ఆ ఏహ్యాభావం కల్గితీరతాయి...తిరిగి బ్రతుకు అణాతోతీరే ఆశే కావాలంటుంది. దొరకనిదానికోసం వెదుకులాడ్డం, దొరికినవాటితో అసంతృప్తి, చీదర సృష్టించుకోవడం మనిషిరూపం — ”

‘‘అయితే మనసు బాధపడుతున్నది—యెందుకంటారు...” చలపతి తీక్షణంగా అడిగాడు.

“యెందుకా? అదోజబ్బు...మనిషిని పూర్తిగా తయారుచెయ్యకుండా భగవంతుడుకొన్ని అల్పత్వాలతో వదిలేశాడు. మనుషులు, యెన్ని అడుగులు యెత్తుగా

యెదిగినా మానసికంగా యెప్పుడూ పసి వాళ్ళే.. తల్లి కన్పించిందంటే ఉయ్యాల్లో ఊగుతున్న పసివాడు కేర్‌మని యేడ్వడం మొదలు పెడతాడు... సరే కదా అని ఆ తల్లి ఉయ్యాలదించి యెత్తుకున్నా, లేక కింద దించినా యేడుస్తూనేవుంటాడు... ఆవిడ విసిగి యే బొమ్మో చేతికిచ్చి ఉయ్యాల్లో కూచోబెట్టి వో ఊపు ఊపి వెళ్ళిపోతుంది... ఆ ఉయ్యాల వోపిక వున్నంత సేపు ఊగుతుంది.. తిరిగి వాడు స్వశక్తితో కుదుపుకుంటే గాని అది కదలదు... ఆ పనిచేలకాదు... అంతగా తడబడుతూలేస్తే పడిపోతామని భయం— దాన్తో తిరిగి యేడుపు మొదలవుతుంది.. చలపతీ... జీవితం యెవరో ఊపితే ఊగేదే... యెప్పుడూ యెవరో ఊపా లనే కోరుకుంటుంది... అలా ఊపు తూంటే బాగానే వుంటుంది... కానీ మనం ఊపుకుని ఊగడానికి బాధపడతాం తప్ప ప్రయత్నం చెయ్యలేం ...... ఇందుమతి బ్రతుక్కూడా అంతే...తనకు తానుగా ఊగలేదు ... అది సాధ్యం కాలేదు... యెవరో ఊపాలి. ఆ క్షణం వరకూ వోపిక పట్టలేక కాళ్లతడబడి నైరాశ్యంలోకి పడిపోయింది...''

హాల్లో గడియారం పదిగంటలు కొడుతూ ఆవలించింది...

''నే వెళ్ళి పడుకుంటాను'' అన్నాడు భానుమూర్తిగారు.

''ఆ గదిలో వేశాను పక్క'' అంది అనసూయ...

''కొంచెం టీ కలిపి తీసుకురా అన సూయా...తాగి పడుకుంటారు''అన్నాడు చలపతి...

''వద్దు...ఆరోగ్యం చెడుతుందని మీ అత్తయ్య ఆ అలవాటు మాన్పించింది'' అన్నాడు కుర్చీలోంచిలేస్తూ.

అనసూయ లోపలినుంచి టీ తీసుకు వచ్చి భర్తకిచ్చింది..చలపతి టీ తాగుతూ అన్నాడు....

''మీ మామయ్యగా రంటే యేమో అనుకున్నాను. పెద్దవేదాంతం వుంది మనిషిలో''

''ఇవన్నీ ఒకళ్ళకి చెప్పడానికే పనికివస్తాయి...మా అత్తయ్య పాపం.. యెన్నో బాధలు అనుభవిస్తోంది యీాయన గారితో...''

''అదేం...''

''అసలు — మామయ్య చదువుకునే రోజుల్లో క్లాస్‌మేట్‌ని ప్రేమించి చాలా దూరం వెళ్ళాడు...అత్తయ్యని యేలుకో నన్నాడు ... ఆఖరికి నలుగురూ చివాట్లు పెడితే, యేం చెయ్యలేక వూరు కున్నాడు...''

''ఇంకేం ఘటికులే...''

''ఆయన్ని కాలం ఊపిన ఉయ్యాల్లో కట్టిపడేశారని కోపం'' అనసూయ నవ్వింది...తిరిగి అంది...



"కొత్తచోటు భయంగా ఉందండి, దొంగగాని వస్తాడేమో?"
"భయ మెందుకు, నువ్వు లేచి నుంచో, వాడే పారిపోతాడు."

"ఓ సారి ఆ ప్రియురాల్ని యింటికి తీసుకువస్తే తలబాదుకుని యేడ్వడం మొదలుపెట్టిందిట ... యీయనగారు కోపంలో కొడతాడు...అత్తయ్య అందరికీ వ్రాసి గోలచేసి నోరు మూయిస్తూ వుంటుంది..."

"మరి వొకళ్ళ నొకళ్ళు అర్థంచేసుకున్నా మంటారు..."

"లోకం మెప్పుకోసం...మగవాడు కదా ... ఆధిక్యత యెప్పటికప్పుడు చూపించుకోవడానికి...మరోసారి నిరూపించుకుందుకూ..." అనసూయ అలా అని లోపలికి వెళ్ళిపోయింది...

చలపతి వొక్కసారి కళ్ళు పెద్దవి చేసి చూసేటప్పటికి అనసూయవీపు – ఆ వీపుమీద అల్లుకున్న నక్షత్రాల్లాంటి పూల జాకట్టు – వెలుతురుపడి జారిపోతున్న జాకెట్టుక్రింది నడుం భాగం కన్పించాయి...

చలపతి చప్పున కళ్ళు మూసుకున్నాడు...ప్రభావతి కన్పించింది ... మనసు మాట్లాడుతోంది పరాకుగా ...

"నా లేమితనం మూలంగా నిన్ను నేను పోగొట్టుకున్నాను ప్రభావతీ ... నా అర్ధాంగిగా నువ్వు నిలబడవలసిన స్థానంలో అనసూయ చోటుచేసుకుంది.. నా పెళ్ళి – యీ సంసారం–యిదో మజిలీ లాంటిది నాకు ... తిరిగి యెప్పటికో అప్పటికి యాత్రికుడు గమ్యస్థానానికి చేరుకోవాలికదా....అప్పుడు...వెన్నెల పహరాకాస్తున్న వాకిట్లో ... యిద్దరం కలిసి బ్రతుక్కి రెండోవైపేముందో

తెల్సుకుంటాం...యిది చీకటి...యేనాటి కైనా వెన్నెల రావాలి...వస్తుంది ... అంతవరకూ యీశాపం..."

నిశ్శబ్దం చలపతిని భరించలేక కోపంతో అనసూయ దగ్గరకు పరిగెత్తింది...

మరత మంచంమీద వత్తిగిలి పడుకున్న అనసూయ చెంపకి వెన్నెల సింగారం పూస్తోంది. జడలోంచి చెవివరకూ జారిన మల్లెలు గుసగుసలు చెబుతున్నాయి...

"బావా... నిన్ను నేను కాదనలేదు... అలా అంటే నా జీవితానికి అర్ధంలేదు... నువ్వు రాకుండానే, నన్ను చూడనివ్వకుండానే యీ పెళ్ళిచేశారు... అడ్డుకుందుకు అశక్తురాల్ని... నువ్వన్నట్టు ఆడదాని అబలత్వం వివాహ నిశ్చయంలోనే బయటపడుతుంది! సంసారం చేసుకుంటూ యీ చింత పెట్టుకోవడం తప్పని సావిత్రి వుత్తరాల్లో వ్రాస్తోంది... యెలా సాధ్యం శేషూ అది... అన్యాయంగా ఖైదులో పడ్డ వ్యక్తి పరాకుగా కూడా అది నా యిల్లు అనుకోలేదు... జైలుశిక్ష అనంతరం తన యిల్లుని వూహించుకుంటే అది తప్పా... యీ ఖైదులోనే నేను చచ్చిపోతే... నీ మనసులోంచి వొక్క నిట్టూర్పు... నీ కోసం వెలిగి ఆరిపోయిన యీ అనసూయ కోసం వొక్క వోదార్పు అందిస్తావని తెలుసు... మా మయ్య అన్నట్టు యీ నాడు జీవితంలో కాలం ఊపి వదిలిన ఉయ్యాల్లో ఊగుతున్నాను ... అది ఆగిపోకుండా రా.. లేకపోతే నేనూ............

నిశ్శబ్దం నేలకరుచుకుని పడియేడుస్తోంది...

కాలం తెగ్గొట్టుకుని ఊపే ఉయ్యాల్లో చంద్రుడు జోగుతున్నాడు...

చీకటి ఆకాశాన్ని కౌగలించుకుంటోంది...

మేఘాలు నక్షత్రాల్ని ముద్దుపెట్టుకుంటున్నాయి... ★

సినిమా క్విజ్ - జవాబులు

1. మొదటి రాత్రి
2. పెళ్ళిచేసి చూడు
3. దొంగలున్నారు జాగ్రత్త